క్లుప్తంగా

19న శనేశ్వరస్వామి జయంతి

పుంగనూరు: పలు ఆలయాల్లో ఈనెల 19న శ్రీశనేశ్వరస్వామి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పట్టణ సమీపంలోని దండుపాళ్యం రోడ్డులో వెలసి ఉన్న శ్రీశనేశ్వరస్వామి ఆలయం, యాబైరాళ్ల మొరవ వద్ద ఉన్న శ్రీశనేశ్వరస్వామి ఆలయంలో వేకువజామునే హోమాలు, అభిషేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దోష నివారణ చేసుకోవాలని కోరారు.

మారెమ్మకు రాహుకాల పూజలు



పుంగనూరు: పట్టణంలోని బస్టాండు వద్ద వెలసిన శ్రీవిరూపాక్షి మారెమ్మ ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు నిర్వహించారు. ఉదయం నిత్య కైంకర్యాలు చేపట్టారు. మధ్యాహ్నం 3నుంచి 4–30 వరకు రాహుకాల సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, విశేషంగా అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై, నెయ్యిదీపాలు వెలిగించి పూజలు చేశారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



సోమల: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్ అధ్యక్షతన సోమల 1 సచివాలయంలో పర్యావరణ పరిరక్షణపై అటవీశాఖ అధికారులు పర్యావరణ హిత జీవన శైలి అనే అంశంపై వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఎఫ్ఎస్ఓ రాకేష్ కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం ద్వారా కలిగే నష్టాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ నేత వరదం వెంకటరమణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రమణయ్య, ఫారెస్ట్ బీట్ అధికారి రామచంద్ర, ఏబీఓ చంద్రబాబు పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్‌కు స్థలం పరిశీలన

రామకుప్పం: మండల కేంద్రంలో అదనంగా జగనన్న లే అవుట్ ఏర్పాటు కోసం స్థలాన్ని మంగళవారం సాయంత్రం కుప్పం ఆర్డీఓ శివయ్య పరిశీలించారు. ఇంటి స్థలాల కోసం అధికశాతం ప్రజలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా అదనంగా మరో జగనన్న లే అవుట్‌ను సిద్ధం చేస్తున్నారు. ఆర్డీఓ మాట్లాడుతూ త్వరలో అర్హులందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, తహసీల్దార్ మురళి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

గుడుపల్లె: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని వైఎస్ఆర్ క్రాంతి పథం ఏపీఎం శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం గుడుపల్లె, శెట్టిపల్లె, బెగ్గిలిపల్లెలో ప్రకృతి వ్యవసాయ సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సేంద్రియ ఎరువులు, కషాయాలతో మందులు తయారు చేసుకుని పంటలు పండించాలన్నారు. కార్యదర్శ చంద్రప్ప, యూనిట్ ఇన్‌చార్జ్‌లు మునికృష్ణ, శ్రీదేవి పాల్గొన్నా రు.

కారు–లారీ ఢీ

వి.కోట: వి.కోట–పలమనేరు రహదారిలోని జవునిపల్లె క్రాస్ వద్ద మంగళవారం ఎదురెదురుగా వస్తున్న కారు–లారీ ఢీకొన్నాయి. ఈఘటనలో కారు ముందు భాగం ధ్వంసమైంది. పోలీసుల కథనం మేరకు.. పలమనేరు వద్ద విరుపాక్షిపురం నుంచి వి.కోట వైపు కారు వస్తుంది. అదే సమయంలో వి.కోట నుంచి పలమనేరు వైపు లారీ వస్తోంది. జవునిపల్లి క్రాస్ బ్రిడ్జి వద్ద కారు, లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఎవరికీ ఎలాంటి గాయాలు తగులలేదు.

పశు వైద్య శిబిరం

సోమల: మండలంలోని ఎస్.నడింపల్లె పంచాయతీ సూరయ్యగారిపల్లెలో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి చందనప్రియ ఆధ్వర్యంలో 80 పశువులకు పిడుదుల నివారణ మందు, 15 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. పశు విజ్ఞానబడి నిర్వహించి, వేసవిలో పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

పథకాలపై ఇంటింటి ప్రచారం



మాట్లాడుతున్న పెద్దిరెడ్డి

సదుం: ప్రభుత్వ పథకాల లబ్ధిని ఇంటింటికీ వివరించాలని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం వారితో సమావేశం నిర్వహించారు. అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలని తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకూడదన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు సోమ శేఖర్ రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, వైస్ సర్పంచ్ బాబురెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్త జన జాతర



అమ్మవారి జలధి ఊరేగింపులో అశేష భక్తజనం

పలమనేరు: కోలాటలు, చెక్కభజనలు, పిల్లనగ్రోవులు, బ్యాండ్‌సెట్, విచిత్ర వేషధారణలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో మంగళవారం పలమనేరు పట్టణం హోరెత్తింది. తిరుపతి గంగమ్మ జాతరలో భాగంగా మూడో రోజు మంగళవారం అమ్మవారి జలధి(నిమజ్జనం) కోలాహలంగా జరిగింది. ఉదయం ఆలయం వద్ద నుంచి శిరస్సు మెరవణి బజారువీధి, జిలానీక్రాస్, రామలక్ష్మణ థియేటర్ రోడ్ మీదుగా గాంధీనగర్ చివరి వరకు సాగింది. అనంతరం అక్కడి గంగమ్మ బావిలో అమ్మవారిని జలది చేశారు. ఈ ఊరేగింపులో పట్టణవాసులు భారీగా పాల్గొన్నారు. ఆద్యంతం భక్తజన సందడి నెలకొంది. ఎలాంటి ఇబ్బందులు జరగకుండా సీఐ చంద్రశేఖర్ పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఆలయం వద్ద పగలు తోపు, వసంతోత్సవం జరిగింది. అశేష భక్తజనంతోపాటు ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర మురళీకృష్ణ, ఆలయ చైర్మన్ కండల నరేష్ పాలవర్గ సభ్యులు పాల్గొన్నారు. నేడు ఆలయం వద్ద హుండీ లెక్కింపు, అమ్మవారి చీరల వేలం నిర్వహించనున్నట్టు కమిటీ నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల జాతరను విజయవంతం చేసిన పట్టణ వాసులకు, పోలీసులకు ఆలయ పాలక వర్గం కృతజ్ఞతలు తెలిపింది.

సల్లాపురెమ్మ జాతర ప్రారంభం

బైరెడ్డిపల్లె: స్థానిక ఎస్సీ కాలనీలో మంగళవారం శ్రీ సల్లాపురెమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు జరిగాయి.ఆలయం వద్ద గణపతి హోమం, దుర్గాహోహం, లలితా సహస్ర నామ హోం నిర్వహించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ నెల 18న సాంస్కృతిక కార్యక్రమాలు, 19న పుష్ప పల్లకి, పూలగెరిగె కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా గంగ పండుగ

రొంపిచెర్ల: రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీ పాతకురవపల్లెలో మంగళవారం గంగ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు పొంగళ్ల సామగ్రి గంపలు ఎత్తుకుని ఆలయం వద్దకు ఊరేగింపుగా వెళ్లారు. పొంగళ్లు వండి నివేదించారు.



పలమనేరు: ఊరేగింపు ముందు వేషధారణలు





రొంపిచెర్ల: పాతకురవపల్లెలో..

ముత్యాలమ్మకు మహాభిషేకం



రొంపిచెర్ల ముత్యాలమ్మ ఆలయంలో..

రొంపిచెర్ల: రొంపిచెర్లలో ముత్యాలమ్మ జాతర మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజామున 3 గంటలకు ముత్యాలమ్మకు 101 బిందెల పసుపు నీళ్లతో అభిషేకం, పంచామృత, సుగంధ ద్రవ్యాలతో మహాభిషేకం నిర్వహించారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు గుణశేఖర్ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయంలో అన్నదానం చేశారు. రాత్రి అమ్మవారి ఊరేగింపు వేడుకగా జరిగింది.



పులిచెర్లలో బోనాలతో వస్తున్న భక్తులు

పులిచెర్లలో జాతర సందడి

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల నడివీధి గంగమ్మ, కల్లూరు విరూపాక్షమ్మ ఆలయ జాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. పులిచెర్లలో అమ్మవారికి స్థానికుడు, జిల్లా ప్రింటింగ్ ప్రెస్ చైర్మన్ గోటూరి మురళీమోహన్‌రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. భక్తులు పొంగళ్లతో భారీగా తరలివచ్చి అమ్మవారికి నివేదించారు. కల్లూరులో కూడా పొంగళ్లు పెట్టి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

సోమల: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులకు ఈఓపీఆర్డీ ఎస్ఏ గపూర్ సాహెబ్ సూచించారు. మంగళవారం పెద్ద ఉప్పరపల్లె జగనన్న కాలనీలో నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం పారిశుధ్య పనులను పరిశీలించారు. సచివాలయాన్ని తనిఖీ చేసి సిబ్బంది హాజరు, బయోమెట్రిక్, రికార్డులను తనిఖీ చేశారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన వారిపై కేసు

సోమల: శాంతి భద్రతలకు భంగం కలిగించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ మారుతి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని నంజంపేట మార్గంలో సోమవారం మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు రామచంద్రయాదవ్, నగేష్, సుధాకర్, అనిల్‌కుమార్, ఈశ్వరయ్య, చెన్నకేశవులు, రమేష్, రత్నన్న వాహనాలను అడ్డగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని సోమల హరిజనవాడకు చెందిన రమణయ్య ఫిర్యాదు చేశారని తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడమే కాకుడా ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ రోడ్డుపై బైఠాయించి శాంతి భద్రతలకు భంగం కలిగించారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎంపీడీఓగా నారాయణ



పుంగనూరు: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా నారాయణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కలకడ నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి ఈవోపీఆర్డీగా వచ్చారు. ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా ఉన్న రాజేశ్వరి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డిని ఆయన కలసి పలు విషయాలపై చర్చించారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

పుంగనూరు/సదుం/సోమల/రొంపిచెర్ల: ఓటరు కార్డుకు ఆధార్‌కార్డుతో అనుసంధానం చేసుకోవాలని పుంగనూరు తహసీల్దార్ సీతారామన్, సదుం తహసీల్దార్ చంద్రశేఖర్, సోమల తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి,రొంపిచెర్ల డిప్యూటీ తహసీల్దార్ లోకేష్ తెలిపారు. మంగళవారం ఆయా ప్రాంతాల్లో వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని బీఎల్‌వో కార్యాలయాల్లో ఓటరు నమోదుకు ఫారం 6 అందజేయవచ్చన్నారు. ఫారం –7 ద్వారా ఓటరు తొలగింపు, ఫారం–8 ద్వారా సవరణలు, పోలింగ్ కేంద్రం మార్చుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఓటర్లు, యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓర్వలేకే టీడీపీ విమర్శలు

గుడుపల్లె: ముఖ్యమంత్రి ఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లభిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే టీడీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నా యకులు తెలిపారు. మంగళవారం స్థానిక శ్రీరాళ్లగంగామాంబ ఆలయం వద్ద పార్టీ మండల కో కన్వీనర్ రామమూర్తి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సంక్షేమం, అభివృద్ధిని చూడలేక టీడీపీ నేతలు గుడ్డివారిలా మారారని ఆరోపించారు. పథకాలు దళారి వ్యవస్థ లేకుండ నేరుగా లబ్ధిదారుని ఖాతాలకు అందుతున్నాయని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా రైతులకు సేవలు అందుతున్నాయని, ప్రతి గ్రామ పంచాయతీలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్ ఏర్పాటు వంటి సేవలు, 104 ద్వారా గ్రామాలకు వైద్య సేవలు అందించడం.. నాడు నేడు కింద స్కూళ్లలోఅభివృద్ధి టీడీపీ నాయకులకు కనబడడం లేదా అని ప్రశ్నించారు. అభివృద్ధిని చూసి మాట్లాడాలన్నారు. ఎంపీటీసీ సభ్యుడు వెంకటేష్ నాయకులు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ లబ్ధి



సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. మంగళవారం మండలంలోని పసుపత్తూరు సచివాలయ పరిధిలోని నాయనిచెరువు, ఎగువ, దిగువ, నడిమి గొర్రెలదొడ్డి, కుర్రప్పల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. ఎన్నడూ లేని విధంగా పథకాల అమలు తెలుసుకునేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పథకాల లబ్ధితో తాము ఆనందంగా ఉంటున్నామని ప్రజలు చెబుతున్నారని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ అనుయాయులకే పథకాల లబ్ధి అందిందని ఆరోపించారు. తమ ప్రభుత్వంలో అర్హులను వెతికి మరీ లబ్ధి చేకూరుస్తున్నట్లు తెలిపారు. ఒకటో తేదీ ఉదయమే వృద్ధులకు పింఛన్లు అందుతున్నట్లు తెలిపారు. అనంతరం స్థానికులు తన దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏ ఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, ఎంపీపీ వెంకటరమ ణ, సర్పంచ్ రామక్క, ఎంపీటీసీ సభ్యురాలు కస్తూ రమ్మ, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి, పురుషోత్తం, రెడ్డెప్పరెడ్డి, చిన్నరెడ్డెప్ప, రవి, శీన, తహసీల్దార్ అమర్నాథ్, ఎంపీడీవో శివప్రసాద్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ

నాయనిచెరువు రోడ్డు ప్రారంభం

పలమనేరు– బెంగుళూరు హైవే ఆనుకుని నాయని చెరువు, ఎగువ, దిగువ, నడిమి గొర్రెలదొడ్లు గ్రామాలను కలుపుతూ కుర్రప్పల్లె, మార్జేపల్లె వరకు ఈఏపీ గ్రాంట్స్ రూ. 2.28 కోట్లు నిధులతో 4.8 కిలోమీటర్లతో నూతనంగా నిర్మించిన రోడ్డును జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రి అమర్‌నాథరెడ్డి నియోజకవర్గ అభివృద్ధిని పక్కన పెట్టి తన స్వలాభాల కోసం పాకులాడారని విమర్శించారు. తమ ప్రభుత్వంలో 30 ఏళ్ల ప్రజల కలను సాకారం చేసినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

పుంగనూరు: ప్రజల నుంచి వచ్చే సమస్యల పరిష్కారానికి సచివాలయాల్లో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి సూచించారు. మంగళవారం సింగిరిగుంట సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అటెండెన్స్, ఆన్‌లైన్ నమోదు, సర్టిఫికెట్ల పంపిణీ తదితరాలను పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ కింది స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను ప్రజలకు వివరించి, ఆయాశాఖల అధికారులకు పంపాలన్నారు. సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లతో కలసి రోజుకు రెండుమూడు గ్రామాలు పర్యటిస్తూ ప్రభుత్వ పథకాల అమలుతీరుపై సమాచారం సేకరించాలన్నారు. సర్పంచ్ ఆంజప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబు, ఆనంద తదితరులు పాల్గొన్నారు.



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

కుప్పం జాతరకు వేళాయే

కుప్పం పట్టణంలో శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర బుధవారం ప్రారంభం కానుంది. తొమ్మిది రోజులు జరిగే ఈ జాతరకు ఆలయ కమిటీ సర్వం సిద్ధం చేసింది. ఈనెల 9వ తేదీ చాటింపుతో జాతరకు శ్రీకారం చుట్టారు. జాతర లోపు ఆలయ పునర్నిర్మాణం పూర్తి కావడంతో ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుద్దీపాలంకరణలు మిరుమిట్లు గొలుపుతున్నాయి.

- నేటి నుంచి శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ వేడుకలు
- ఆలయ పునర్నిర్మాణంతో మిన్నంటిన ఉత్సాహం
- సర్వం సిద్ధం చేసిన ఆలయ కమిటీ

కుప్పం: శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర కోసం ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. చలువ పందిళ్లు, పురవీధుల్లో విద్యుద్దీపాలంకరణలు చేపట్టారు. పట్టణం నలువైపులా అమ్మవారి విద్యుద్దీపాల కటౌట్లు మిరమిట్లు గొలుపుతున్నాయి. జాతరకు స్వాగతం పలుకుతూ భారీ ఎత్తులో ఎగుర వేసిన బెలూన్ ఆకట్టుకుంటోంది. బుధవారం రాత్రి వినాయక ఉత్సవం ఊరేగింపుతో జాతర ప్రారంభం కానుంది. రాత్రి టీవీ నటీ నటులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి ముత్తమారెమ్మ ఉత్సవ ఊరేగింపు జరుగుతుంది. అనంతరం టీవీ కళాకారుల డాన్స్ ప్రోగ్రాం ఉంటుంది. శుక్రవారం మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం, రాత్రి టీవీ కళాకారుల మెగా డాన్స్ ప్రోగ్రాం, సోమవారం రాత్రి ముత్తుమారెమ్మ అగ్నిగుండ ప్రవేశం, 54 పుష్పపల్లకిలు, బాణసంచా వేడుకులు, పచ్చగెరిగ, మంగళవారం తిరుపతిగంగమ్మ శిరస్సు ఊరేగింపు, బుధవారం అమ్మవారి విశ్వరూప దర్శనం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈమేరకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.



పునర్నిర్మించిన తిరుపతి గంగమ్మ ఆలయం

అనుకున్నది అనుకున్నట్లుగా

తిరుపతి గంగమ్మ ఆలయం పునర్నిర్మాణం కోసం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రూ.3 కోట్ల ప్రభుత్వ నిధులను మంజూరు చేయించారు. డిసెంబర్‌లో పనులకు శ్రీకారం చుట్టారు. ప్రతిపక్షాల విమర్శలకు దీటుగా ఎమ్మెల్సీ భరత్, రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్ ప్రత్యేక చొరవ చూపి పనులను తరచూ పర్యవేక్షిస్తూ అనుకున్న సమయానికి పూర్తి చేయించారు. దీంతో సర్వత్రా హర్షం వ్యక్తం అయ్యింది.

పకడ్బందీ ఏర్పాట్లు

మూడు రాష్ట్ర సరిహద్దులో ఉన్న శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయ జాతరకు ఎంతో ప్రాధాన్యం ఉంది. మూడు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. జుశిరస్సు ఊరేగింపు, విశ్వరూప దర్శనానికి వేలాదిగా విచ్చేసే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విస్తృత చర్యలు తీసుకుంటున్నాం. భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమ్మవారిని దర్శించుకునేలా ఆలయ ప్రాగణంలో ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశాం. రోజూ ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయి.

– మంజునాథ్, చైర్మన్, తిరుపతి గంగమ్మ దేవస్థానం



చలువ పందిళ్లు



జాతరకు ఆహ్వానం పలుకుతూ ఎగుర వేసిన బెలూన్

దేశానికే ఆదర్శంగా జగనన్న పథకాలు




సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. మంగళవారం మండలంలోని రామకుప్పం పంచాయతీ కోట్లగూరు, వెంకటాపురం, అయ్యప్పగానిపల్లె, కెంపసముద్రం గ్రామాల్లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో మహిళలు భరత్‌కు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కరోనా విపత్కర పరిస్థితుల్లో కూడా నవరత్నాలను కొనసాగించి అర్హులకు నేరుగా వారి ఖాతాలకు నగదు జమ చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధి కొనసాగాలంటే వైఎస్సార్ సీపీకి రానున్న ఎన్నికల్లో మరో అవకాశం ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకు రాగా, సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు.సిమెంటు రోడ్లు, తాగునీటి సౌకర్యం, కాలువల నిర్మాణాలు చేపట్టేందుకు నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, పార్టీ కో కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, స్థానిక నేతలు నారాయణస్వామి, గోవిందప్ప, రవి, రాఘవ, శ్రీరామప్ప, వెంకటరామ, వేణప్పరెడ్డి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

రామకుప్పం మండలంలోని గోవిందపల్లికి చెందిన రఘు కుమారుడు ఒకటిన్నర సంవత్సరం బాలుడు నిహాల్‌కు పేగు మడతపడి బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన వాడు కావడంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా, ఆరోగ్య ఖర్చులకు రూ.45 వేలు నగ దు మంజూరు అయ్యింది. ఈ చెక్కును మంగళవారం బాలుడి తండ్రి రఘుకు ఎమ్మెల్సీ భరత్ అందజేశారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



పుంగనూరు : వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ



రొంపిచెర్లలో ర్యాలీ


పుంగనూరు: మలేరియా, డెంగీ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి బాలుసాయిరెడ్డి తెలిపారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలో సిబ్బందితో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ప్రజలు నీటిని కాచి వడపోసి తాగాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున పిల్లలు, పెద్దలు బయట తిరగకూడదని తెలిపారు. మంచినీరు, మజ్జిగ, కొబ్బరి నీరు తాగాలన్నారు. కుళ్లిన పండ్లు, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తింటే రోగాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. కరపత్రాలను పంపిణీ చేశారు.

డెంగీ వ్యాధిపై అవగాహన

రొంపిచెర్ల: డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా రొంపిచెర్లలో పీహెచ్‌సీ వైద్యాధికారి రాజ ఆధ్వర్యంల సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సీహెచ్‌వో కాంతమ్మ, పీహెచ్‌ఎన్ పార్వతమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ పంకజ పాల్గొన్నారు.

డెంగీని నిర్మూలిద్దాం

పులిచెర్ల(కల్లూరు): ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉండేలా చూద్దామని కల్లూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ జానకీరావు తెలిపారు. కల్లూరులో మంగళవారం వైద్య సిబ్బందితో డెంగీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి కుమదవల్లీ, హెల్త్ సూపర్‌వైజర్ శారద, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



కల్లూరులో వైద్య సిబ్బంది ర్యాలీ

కడపనత్తంలో..

బైరెడ్డిపల్లె: డెంగీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కడపనత్తం గ్రామంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీహెచ్ఓ సావిత్రమ్మ, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రత అవసరం

సదుం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి చరణ్ సూచించారు. రెడ్డివారిపల్లెలో డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు ఉదయభాస్కర్, నీలకంఠ, భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన అవసరం

రామకుప్పం: మండలంలోని విజలాపురం పీహెచ్‌సీ పరిధిలో మంగళవారం వైద్యాధికారి అల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.